క్లుప్తంగా

18న జాబ్‌మేళా



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఆత్మకూరు: ఈనెల 18న ఆంధ్రప్రదేశ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనెర్జిమ్ ప్రయివేట్ లిమిటెడ్, శ్రీధర్ సీసీ, కె.ఎల్.గ్రూప్స్ ప్రతినిధులు హాజరవుతారన్నారు. పది, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6303244165, 7673902328 సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, ప్లేస్‌మెంట్ అధికారి కె.సుబ్బన్న పాల్గొన్నారు.

16న నంద్యాలలో యాదవ ఆత్మీయ సమ్మేళనం

వెలుగోడు: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 16న నంద్యాలలోని పద్మావతి నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ దేవాలయం వద్ద యాదవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు మహాసభ రాష్ట్ర నాయకులు ఎస్ రఘురాముడు యాదవ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన అఖిలభారత యాదవ మహాసభ యాదవ అభ్యుదయం పేరుతో సమావేశాలు నిర్వహించి క్లస్టర్ల ఏర్పాటు, శతాబ్ది ఉత్సవాల సన్నాహాలు, గీతా అధ్యయనం, కార్యవర్గంపై చర్చ ఉంటుందన్నారు. జిల్లాలోని యాదవులందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు నాగేశ్వరావు యాదవ్, శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞానభాండాగారాలు

నందికొట్కూరు: గ్రంథాలయాలు జ్ఞానభాండాగారాల్లాంటివని గ్రంథాలయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం పాములపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎం గోపాల్ అధ్యక్షతన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దామరేకుల రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వీబీఆర్‌కు 3,200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

వెలుగోడు: భానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు ఛానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 3,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు. గురువారం వీబీఆర్‌లో 16.32 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ తెలిపారు. అలాగే వీబీఆర్ నుంచి మద్రాస్ కాలువకు 5,000 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 55 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి కోసం పది క్యూసెక్కుల నీటిని దిగువకు పంపుతున్నట్లు ఏఈ చెప్పారు.

బాలుడిని కాపాడిన కానిస్టేబుల్



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్ఐ

బండిఆత్మకూరు: కుందూనదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ బాలుడిని కానిస్టేబుల్ కాపాడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. నంద్యాల మండలం చాబోలు గ్రామానికి చెందిన 12 ఏళ్ల సంతోష్‌కుమార్ సరిగ్గా చదవడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో బండిఆత్మకూరుకు వచ్చి కుందూనదిలో దూకి ఆత్మహత్యకు యత్నించాడు. అటుగా వెళ్తున్న కానిస్టేబుల్ నాగిరెడ్డి సకాలంలో స్పందించి నీళ్లలో దూకి బాలుడిని కాపాడి స్టేషన్‌కు తీసుకొచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించారు.

అక్షరాస్యతతోనే ఆర్థికాభివృద్ధి

మహానంది: అక్షరాస్యత ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వయోజన విద్యాశాఖ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతాప్ అన్నారు. బుక్కాపురంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం ఉల్లాస్ ప్రోగ్రాంలో భాగంగా పొదుపు మహిళలు, వయోజన విద్యా వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు కిషోర్‌రెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

అందరికీ వైద్య పరీక్షలు

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు, నారాయణాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం అందరికీ వైద్య పరీక్షలు ఎన్‌సీడీ-3.0ను ప్రారంభించారు. వైద్యులు భావనారెడ్డి, కిరణ్ కుమార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్, రక్తహీనత, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జ్యోతి దర్శనం.. మహాభాగ్యం

- నేడు రుద్రకోడు పుణ్యక్షేత్రంలో జ్యోతి దర్శనం
- కార్తీక పౌర్ణమి పూజలకు తరలిరానున్న భక్తులు

నల్లమల అటవీ పరిధిలో వెలిసిన రుద్రకోడు పుణ్యక్షేత్రం జ్యోతి దర్శనానికి సిద్ధమైంది. శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న జ్యోతి దర్శనం వీక్షించేందుకు భక్తులు క్షేత్రానికి తరలిరానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. – ఆత్మకూరు



శ్రీ రుద్రకోటేశ్వరస్వామి క్షేత్రం



(ఇన్‌సెట్) క్షేత్రంలో వెలిసిన రుద్రకోటేశ్వరస్వామి

ఏటా కార్తీకమాసంలో పౌర్ణమి రోజు రుద్రకోడు క్షేత్రంలో దర్శనమిచ్చే జ్యోతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. గతంలో ఈ క్షేత్రంలో జ్యోతి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో నల్లమల అటవీ ప్రాంతాల సమీపంలోని పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు మండలాల ప్రజలు ఎద్దులబండ్లు, కాలినడకన క్షేత్రానికి చేరుకునేవారు. ప్రస్తుతం అటవీమార్గంలోనూ, ఆటోలు, మోటార్‌సైకిళ్లు, ట్రాక్టర్లపై చేరుకుంటున్నారు. కార్తీకమాస పౌర్ణమి రోజున చిమ్మచీకటి అలుముకునే సమయంలో రాత్రి 7 నుంచి 7.05 గంటల సమయంలో నల్లమల సిగలో మకరజ్యోతి దర్శనం ఇస్తుంది. నిజమైన భక్తి విశ్వాసంతో మహాశివుడిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించిన భక్తులకు మాత్రమే జ్యోతి కనిపిస్తుందని ప్రజల నమ్మకం.

సాంస్కృతిక కార్యక్రమాలు

రుద్రకోడు క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్యోతి దర్శనంతో పాటు రాత్రి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రసిద్ధి. వీరబ్రహ్మేంద్రస్వామి నాటకం, భజన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను రుద్రకోడు క్షేత్ర కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. భక్తులందరూ జాగరణ చేపడతారు. నల్లమల అటవీ పరిధిలోని నల్లకాల్వ మీదుగా దట్టమైన అరణ్యంలో 18 కి.మీ. దూరంలో ఈ క్షేత్రం ఉంది. భక్తులకు పురోహితులు నల్లగుంట్ల నారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది.

విశేష పూజలు

రుద్రకోడు క్షేత్రంలో వెలిసిన రుద్రకోటేశ్వర, రుద్రాణి మాతకు కార్తీకమాసం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తారు. వేకువజామున 4 గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్వామివారికి ప్రత్యేక అలంకరణ, రుద్రాణిమాతకు లక్ష కుంకుమార్చనలు, ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. వేకువజామున భక్తులు క్షేత్ర సమీపంలోని కోనేరులో పుణ్యస్నానం ఆచరించి రుద్రాణి, రుద్రకోటేశ్వరస్వామివార్లను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు.

మహానందిలో నేడు కార్తీకపౌర్ణమి వేడుకలు

మహానంది: మహానంది దేవస్థానంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా కోటి దీపోత్సవం, జ్వాలాతోరణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. తెల్లవారుజాము నుంచే దర్శనాలు ప్రారంభమవుతాయని, సాయంత్రం జ్వాలాతోరణం, కోటి దీపోత్సవం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

బిషప్ చర్చిలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ప్రార్థన

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కర్నూలు పట్టణంలోని బిషప్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సాయి ఈశ్వర్ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం క్లీన్ చిట్ ఇవ్వడంతో పాటు కేసు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గురువారం బిషప్ చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బిషప్ చర్చి గురువులు సిద్ధిపోగుల దేవదాసు, బాబులు దీవెనలు తీసుకున్నారు. 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అంతకుముందు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి కుమారుడి పెళ్లికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దార సుధీర్, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, నాయకులు హాజరై నూతన వధువరులను ఆశీర్వాదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, నాయకులు యాట ఓబులేసు, చంద్రమౌళి, నాగిరెడ్డి, మన్సూర్, రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



బిషప్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

సంగమేశ్వరంలో కార్తీక శోభ



సంగమేశ్వరంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరంలోని ఉమామహేశ్వరాలయంలో గురువారం కార్తీకశోభ నెలకొంది. తెలంగాణా, ఆంధ్రా రాష్ట్రాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి లలితాదేవి అమ్మవారికి, శివలింగానికి ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ముందుగా కృష్ణా నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం దేవతామూర్తులకు పూజాక్రతువులు నిర్వహించారు. అదేవిధంగా కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం నుంచి వచ్చిన మహిళా భక్తులు సంగమేశ్వరంలో పార్థీవలింగ పూజలు చేశారు.



ఎగువ పుష్కర ఘాట్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ కేశవ

భక్తులు జాగ్రత్తలు పాటించండి

కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ కేశవ సూచించారు. గురువారం మండలంలోని సంగమేశ్వరం వద్ద ఉమామహేశ్వరాలయం, ఎగువ పుష్కరఘాట్‌లను ఆలయ పురోహితుడు రఘురామ శర్మతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందితో భద్రత నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా సంగమేశ్వరం పుష్కర ఘాట్‌వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

శ్రీగిరిలో కార్తీక దీపారాధన

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భక్తులు వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, దేవస్థానం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాడవీధిలో దీపాలు వెలిగించారు. అనంతరం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద దేవస్థానం సంప్రదాయ బద్ధంగా ఆకాశ దీపాన్ని వెలిగించింది.



పాతాళగంగలో దీపాలు వదులుతున్న భక్తులు

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నందికొట్కూరు: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఎం. రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక ఉద్యోగం ఇవ్వలేదని మండిపడ్డారు. నిరుద్యోగులకు రూ. 3 వేల నిరుద్యోగభృతి ఇస్తామని చెప్పి ఆరు నెలలు గడుస్తున్న ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. దళితులపై, మహిళలపై జరిగే దాడులను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, ఉస్మాన్, బాబు, జయరాణి, నాగన్న, వెంకటేశ్వర్లు, పాండు, స్వాములు, రషీద్, ఆంజనేయులు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ కర్ణ, కోకన్వీనర్ రాము డిమాండ్ చేశారు. గురువారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆపార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రామిరెడ్డి, శివ, శ్రీకాంత్, బి.శివ, నాగయ్య, రవణమ్మ, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల: సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం నరేంద్రమోదీ చేతిలో కీలుబొమ్మగా మారిన సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వానికి తాకట్టుపెట్టి వారు చెప్పినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: రైతులు రాయితీ మినుము విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఏఓ విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 20క్వింటాళ్ల మినుము విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో రాయితీపై మినుము విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని మోటారు సైకిల్‌పై 20 లీటర్ల నాటుసారాను నందికొట్కూరు నుంచి అల్లూరుకు తరలిస్తున్న నీలిషికారి అశోక్‌ను సీఐ, ఎస్ఐలు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ పద్మనాభం, పోలీసులు సుధీర్, శివన్న, మధుప్రసాద్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నిర్మూలన సులభం

కొత్తపల్లి: ముందుగానే క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తే వ్యాధి నిర్మూలనకు సులభం అవుతుందని కొత్తపల్లి వైద్యాధికారి దీపానాగ వేణి సూచించారు. గురువారం కొత్తపల్లి మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ప్రారంభమైన క్యాన్సర్ నిర్ధారణ సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ గుర్రప్ప, దేవ కరుణమ్మ, టీబి సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ సరిత, ఎంఎల్ హెచ్‌పీ శైలజ, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మధుమేహం వ్యాధిని నిర్లక్ష్యం చేయొద్దు



గర్భిణి బరువును పరిశీలిస్తున్న డాక్టర్ యశశ్విని

జూపాడుబంగ్లా: మధుమేహం వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ప్రమాదం కలిగే అవకాశం ఉందని పారుమంచాల ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ యశశ్విని తెలిపారు. ప్రపంచ మధుమేహం వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని పారుమంచాలలో వ్యాధి వ్యాప్తి, లక్షణాలు, నివారణపై గర్భిణులు, బాలింతలతో పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ షుగర్ వ్యాధి మనిషి శరీరంలోని అన్ని అవయవాలపై తీవ్రప్రభావం చూపుతుందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ భ్రమరాంబ, ఎంపీహెచ్ఓ గుట్టలయ్య, సూపర్‌వైజర్ జయకుమారి, ఆరోగ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయండి

నందికొట్కూరు: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవోలు సుబ్రమణ్యం అన్నారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు, ఎంపీటీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అన్నివిధాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను తయారు చేయాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు కలిసి గ్రామానికి అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పగిడ్యాల: 2025–26 గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓపీఆర్డీ నాగేంద్రయ్య మాట్లాడుతూ 2025–26 వార్షిక ప్రణాళికల కోసం గ్రామపంచాయతీ అభివృద్ధి తయారీపై అవసరమైన నిధులను రాబట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాలదివ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులు పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహ ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలపై కరెంట్ ట్రూ అప్ చార్జీలు పెంచడం తగదన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు వీటిని కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. కరెంట్ చార్జీల పెంపును విరమించుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, సుధాకర్, మాబాషా, మల్లికార్జున, సోమన్న, ముర్తూజా పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పగిడ్యాల: 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఈఎంటీ లక్ష్మినారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీఓ సుమిత్రమ్మ, తహసీల్దార్ శివరాముడుకు 108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20తేదీ నుంచి ప్రత్యక్ష సమ్మెలోకి వెళ్తున్నట్లు అరబిందో కంపెనీ, ప్రభుత్వానికి, లేబర్ కమీషనర్‌కు సమ్మెనోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

వెలుగోడు: రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీస్ లను నేరుగా నిర్వహించాలని వెలుగోడు మండల 108 సిబ్బంది ఎల్లా శేషయ్య అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 108 సిబ్బంది తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 108 సిబ్బంది అజమతుల్లా,ఓబులేసు, సుంకన్న,శేఖర్ పాల్గొన్నారు.


శ్రీశైలంప్రాజెక్ట్: 108 వైద్యసర్వీసులను రాష్ట్రప్రభుత్వమే నిర్వహించి సిబ్బందికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం తహసీల్దార్ శ్రీనివాసులుకు 108 సిబ్బంది వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది దొరస్వామి, సుభాని, వలి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శివరాముడు కు వినతిపత్రం అందజేస్తున్న 108 సిబ్బంది

మహానంది: 108 వాహన సేవలు, సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని 108 ఉద్యోగుల సంఘం నాయకులు, ఈఎంటీలు రమణ, రాజయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం వారు మహానంది తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ మహమ్మద్ దౌలాలకు వినతిపత్రాలు అందించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ఈఈ



మహానంది: విద్యుత్ శాఖ జిల్లా ఈఈ శ్రీనివాసరెడ్డి మహానందీశ్వరుడి దర్శనార్థం గురువారం మహానందికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చన చేపట్టారు.

మహానందిలో కొనసాగుతున్న రద్దీ

మహానంది ఆలయంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులరద్దీ కొనసాగుతోంది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణాల్లో కార్తీకదీపాలు వెలిగించారు. అనంతరం కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

పేదలకు ఇళ్లస్థలాలివ్వాలి

జూపాడుబంగ్లా: సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారంగా పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ప్రకారంగా సత్వరమే ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఇచ్చే స్థలాలు నివాసయోగ్యానికి అనువుగా ఇళ్లస్థలాలు కేటాయించాలన్నారు. ఈ మేరకు ఈనెల 18న అన్ని గ్రామసచివాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నరసింహ, చెంచుపుల్లయ్య, శ్రీనివాసులు, అంజి, మధు, నరసన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

ఆత్మకూరు: కరివేన గ్రామంలో గురువారం గుడిసె దగ్ధమైంది. అన్నమ్మకు చెందిన గుడిసెకు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే దాచుకున్న నగదు, బంగారం, వెండి ఆభరణాలు, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయని బాధితురాలు వాపోయారు.

ఎర్రమఠంలో అగ్ని ప్రమాదం

కొత్తపల్లి: ఎర్రమఠం గ్రామంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రైతు దుర్గం ఎల్లయ్య రైతు బీసీ కాలనీలోని తన ఇంటి ప్రక్కన కలంలో దర్గాను నిర్మించుకున్నారు. రాత్రి ఆయన భార్య దుర్గం చిట్టెమ్మ దర్గాకు దీపారాధన చేశారు. దీపాలు ప్రమాదవశాత్తు మొక్కజొన్న పొట్టుపై పడిందని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అగ్ని ప్రమాదంలో వరిగడ్డి, మొక్కజొన్న పొట్టు, శనగ పొట్టు కాలి బుడిదయ్యాయని తెలిపారు. దాదాపు రూ.40 వేల ఆస్తినష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా బాలల దినోత్సవం

నందికొట్కూరు: మండల కేంద్రం నందికొట్కూరుతోపాటు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి ఆయా స్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించాలని ఈ సందర్భంగా ఎంఈఓ సుభాన్ సూచించారు.

- పగిడ్యాల: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా బాలలదినోత్సవ వేడుకలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
- మిడుతూరు: మండల కేంద్రం మిడుతూరుతో పాటు గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సాయి తిమ్మయ్య, ఎంఈఓ-2 శ్రీనాథ్ దివంగత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కొత్తపల్లి: మండల కేంద్రం కొత్తపల్లితోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యతను ఈ సందర్భంగా హెచ్‌ఎం వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



మిడుతూరు జెడ్పీ పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

- జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లాతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా స్కూళ్లలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఆత్మకూరు: మండల కేంద్రం ఆత్మకూరుతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని కృషి పండ్లతోటల సంఘం, రైతు సంఘం కార్యాలయంలో బాలల దినోత్సవం నిర్వహించారు.
- వెలుగోడు: విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదిగి సమాజాభివృద్ధికి దోహదపడాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం,రాష్ట్ర అవార్డు గ్రహీత సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గ్రంథాలయంలో,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవిశంకర్,ఫైజుల్లా, నరసింహులు,సుబ్రహ్మణ్యం, గ్రంథాలయంలో లైబ్రేరియన్ సుమలత, అన్నారపు శేషి రెడ్డి,రాము,ఖలీల్, మోమిన్ రసూల్,సంజీవరాయ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవార్డు గ్రహీత కు సన్మానం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రావు ఈనెల 11వ తేదీన రాష్ట్ర ప్రధాన ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డును ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ మేరకు గురువారం పాఠశాల సిబ్బంది అవార్డు గ్రహీతను ఘనంగా సన్మానించారు.